క్లుప్తంగా

లక్ష్య సాధనకు కృషి

మాజీ సర్పంచ్ శ్రీశైలం



శంకర్‌ను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ శ్రీశైలం

తలకొండపల్లి: లక్ష్య సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని మాజీ సర్పంచ్ కాడమోని శ్రీశైలం పేర్కొన్నారు. మండల పరిధిలోని దేవుని పడకల్‌కు చెందిన పేద కుటుంబంలో పుట్టిన పారేశ మన్నెమ్మల దంపతుల కుమారుడు శంకర్ ఇటీవల ఫైర్ ఆపరేటర్ ఉద్యోగానికి ఎంపికైన సందర్భంగా కాడమోని శ్రీశైలం శాలువా కప్పి సన్మానించారు. పూల బొకే అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శంకర్, యాదయ్య, శ్రీను, శ్రీశైలం, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



వరి ధాన్యం కేంద్రం ప్రారంభించిన డీపీఎంఎస్ అధికారులు

మంచాల: రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని డీసీఎంఎస్ మేనేజర్ రామ కృష్ణ రాజు పేర్కొన్నారు. మంగళవారం మంచాల మండలంలోని బోడ కొండ గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు దళారులను ఆశ్రయించి మోస పోవద్దన్నారు. డీసీఎంఎస్ ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ సిబ్బంది వెంకటేశ్, జగన్‌రెడ్డి, వెంకటరాజ్, పంచాయతీ కార్యదర్శి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

గెలుపును స్ఫూర్తిగా తీసుకోవాలి

మొద్దు సికిందర్‌రెడ్డి



ట్రోఫీని సికిందర్‌రెడ్డికి అందజేస్తున్న క్రీడాకారులు

మంచాల: క్రీడాకారులు గెలుపును స్ఫూర్తిగా తీసుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మొద్దు సికిందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆరుట్ల గ్రామంలో ఆరుట్ల ప్రీమియర్ లీగ్ 'ఆరుట్ల థండర్స్' జట్టుకు మెంటర్‌గా వ్యవహరించి అన్ని విధాలుగా సహకారం అందించిన సికిందర్‌రెడ్డిని శాలువా కప్పి, పూల మాలవేసి సన్మానించారు. అనంతరం రూ.30,016లు, ట్రోఫీ ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా సికిందర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభతోనే ఈ ట్రోఫి గెలుపొందడానికి ప్రధాన కారణమన్నారు. క్రీడాకారులు గెలుపోటములు సమానంగా తీసుకోవాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం

యాచారం: మండల పరిధిలోని చింతుల్ల గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇబ్రహీంపట్నంలోని లీమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి 150 మందికి పైగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లీమ్స్ ఆస్పత్రి ఎండీ, గుండె వైద్య నిపుణులు డాక్టర్ విశ్వనాథ్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, సీపీఎం నాయకులు వినోద్‌కుమార్, శ్రీనువాస్, విజయకుమార్, బుగ్గరాములు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే రంగారెడ్డి

తుర్కయంజాల్: ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తుర్కయంజాల్‌లో ఏర్పాటు చేసిన విందులో ఆయన పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి, కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశు గోస!



ఎండలోనే మేకలు, గొర్రెల క్రయవిక్రయాలు

సంతలో నిలువ నీడ కరువు

- సౌకర్యాల లేమితో తల్లడిల్లుతున్న మూగజీవాలు
- నామ మాత్రంగా టెంట్లు
- ఇబ్బందుల్లో రైతులు
- పట్టించుకోని అధికారులు

యాచారం: మాల్ పశువుల సంతలో పశు గోస తప్పడంలేదు. ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. వేడి గాలులకు అవి తల్లడిల్లిపోతున్నాయి. కనీసం నిలువ నీడ లేక, సౌకర్యాల లేమితో ఇబ్బందులు పడుతున్నాయి. దీంతో రైతులు ఎండలోనే ఉండి క్రయవిక్రయాలు జరుపుతున్నారు. ఎండ వేడిమికి తట్టుకోలేక కొంత మంది వడదెబ్బ సోకి తీవ్ర అస్వస్థతకు గురైన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ విషయంలో పట్టించుకునే వారు లేరు. రంగారెడ్డి-నల్గొండ జిల్లా సరిహద్దులోని యాచారం మండల పరిధిలోని మాల్‌లో ప్రతి మంగళవారం పశువుల సంత జరుగుతుంది. దీనికోసం రెండు జిల్లాల్లోని పలు గ్రామాల నుంచి వందలాది పశువులు, గెదేలు, గొర్రెలు, మేకలు తీసుకొస్తారు. మాల్ పశువుల సంత అంటే క్రేజ్ ఉంది. మేలు జాతి పాడి పశువులు, అరక దున్నె కాడెద్దులు, ఎద్దులు, పశువులు దొరుకుతాయని ఇక్కడికి వస్తుంటారు.

లక్షల్లో ఆదాయం

పశువుల సంత నిర్వహణతో గ్రామ పంచాయతీకి ప్రతి యేటా రూ. లక్షల్లో ఆదాయం వస్తుంది. క్రయ, విక్రయాలు జరిపే పాడి పశువులకు ఒక్కో దానికి రూ. 650, గొర్రెలు, మేకలకు రూ. 150 చొప్పున పన్నులు వసూలు చేస్తున్నారు. దూడలు, మేక పిల్లలు, రెండు, మూడేళ్ల వయస్సున్న పశువులకు రూ. 100నుంచి రూ. 200ల వరకు ఉంది.



కొనుగోలు దారుల కోసం వేచి చూస్తున్న మహిళా రైతు

ఇలా ప్రతి వారం నిర్వహిస్తారు. కానీ అక్కడ కొనుగోలు, అమ్మకాలు చేసే సమయంలో నీడ, తాగునీటి సౌకర్యాలు కల్పించడంలో పంచాయతీ అధికారులు ఏ మాత్రం శ్రద్ధ పెట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి. సంత నిర్వహణకు వేలం పాట ద్వారా వచ్చే ఆదాయంతో మాల్ గ్రామ పంచాయతీ కాలనీల్లో పలు అభివృద్ధి పనులు చేస్తారు. కానీ సంతలో మాత్రం ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు.

వెంచర్లల్లోనే నిర్వహణ

రూ. లక్షల్లో ఆదాయం వస్తున్న మాల్‌లో నిర్వహణ ప్రయివేట్ వెంచర్లలోనే కొనసాగుతుంది. వెంచర్ల యజమానులు ప్లాట్ల మధ్యన సంత నిర్వహించరాదని పలుమార్లు హెచ్చరికలు కూడా జారీ చేశారు. కొన్ని సార్లు ఇబ్బందులు పెట్టిన దాఖలాలు కూడా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో పశువుల సంత నిర్వహణ వల్ల ప్రతి యేటా రూ. 50 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. దీంతో ఇది పశువుల సంత క్రయవిక్రయాల్లో ప్రథమ స్థానంలో ఉంది. కానీ దీని నిర్వహణకు శాశ్వత స్థలం కేటాయిస్తే బాగుంటుందని రైతులు కోరిన ప్పటికీ స్పందన లేదు.

వేలం పాట ద్వారా సమకూరిన ఆదాయం

2019-20 సంవత్సరంలో రూ. 41 లక్షలు, 2020-21లో రూ. 52 లక్షలు, 2021-22లో రూ. 53 లక్షలు, 2022-23లో రూ. 63లక్షలు, 2023-24లో రూ. 71 లక్షలు సమకూరింది.

ఇబ్బందులు పడుతున్నాం



రెండు వారాలుగా ఎండల తీవ్రత పెరుగుతూనే ఉంది. గంటల కొద్ది ఎండలో ఉండి పశువులను బేరం చేయాలంటే తట్టుకోలేకపోతున్నాం. ఇక్కడ నీడ ఉండడం లేదు. కనీసం టెంట్ల సౌకర్యం కూడా లేదు. కొద్ది సేపు సంతలో ఉండి ఇళ్ల మధ్యకు, చెట్ల నీడకు వెళ్లి కూర్చుంటున్నాం. పశువులను తీసుకోస్తే ఎండకు తల్లడిల్లుతున్నాయి.

– బక్కారాం మల్లేశ్, రైతు, మొండిగౌరెల్లి

అధికారుల నిర్లక్ష్యం



మాల్ పశువుల సంతకోసం సర్వే నంబరు 640లో 5 ఎకరాల భూమిని కేటాయించాలని 20 ఏళ్లుగా పలువురు కలెక్టర్లను కోరినప్పటికీ స్పందన లేదు. రంగారెడ్డి-నల్గొండ జిల్లాల్లో మాల్ పశువుల సంతకు ఎంతో పేరుంది. ఈ విషయంలో అధికారులు దృష్టి పెట్టి శాశ్వత స్థలం కేటాయించాలి.

– లిక్కి జంగారెడ్డి, మాజీ సర్పంచ్, మాల్

స్థల కేటాయింపునకు చర్యలు



మాల్ పశువుల సంతకు ప్రభుత్వ భూమిని కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు తన దృష్టికి తెచ్చిన మాట వాస్తవం. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగియగానే జిల్లా కలెక్టర్‌ను కలిసి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించే విధంగా కృషి చేస్తా. అవసరమైతే రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కరిస్తాను.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

ఓటు వజ్రాయుధం

- డీపీఎం నర్సింహా
- ఓటు హక్కుపై అవగాహన

తలకొండపల్లి: ఓటు వజ్రాయుధం వంటిదని డీపీఎం నర్సింహ్మా పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ ఓటును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ హాస్టల్ విద్యార్థినులకు మంగళవారం ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటు విలువ ఏంటో నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కును తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థినులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటర్‌గా నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు దీప, రాములు, విజయలక్ష్మి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు కీలకం: మున్సిపల్ కమిషనర్

తుర్కయంజాల్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని మున్సిపల్ కమిషనర్ బి సత్యనారాయణ రెడ్డి కోరారు. మంగళవారం పురపాలక సంఘం పరిధి బ్రాహ్మణపల్లిలోని డాల్ఫిన్ చాక్లెట్ కంపెనీలో క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం అనే అంశంపై ఉద్యోగులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఓటు ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో చాక్లెట్ కంపెనీ మేనేజర్ మాజీద్, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఇఇ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్: అవగాహన సదస్సులో కమిషనర్ సత్యనారాయణ రెడ్డి

పాపన్నగౌడ్‌కు ఘన నివాళి



ఆమనగల్లు: సర్వాయిపాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అల్లాజీగౌడ్, గౌడసంఘం నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో మంగళవారం బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ వర్ధంతి వేడుకలను గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని జాతీయ రహదారిపై రాజీవ్ చౌరస్తా వద్ద చిత్రపటాన్ని ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌడసంఘం నాయకులు మాట్లాడుతూ ఆయన ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి నియోజక వర్గ గౌడసంఘం అధ్యక్షుడు చుక్క అల్లాజీగౌడ్ ఉపాధ్యక్షుడు గంగారవిగౌడ్ మండల అధ్యక్షుడు చుక్క నిరంజన్‌గౌడ్, పాపన్నగౌడ్ యువజన సంఘం అధ్యక్షుడు కుమార్‌గౌడ్, గౌడసంఘం అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్ పాల్గొన్నారు.

మాడ్గుల: నాగిళ్ల గ్రామంలో గౌడ సంఘ సభ్యులు పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రతీక అని కొనియాడారు.

వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న వెంకటరమణ, మల్లేశ్

ఆమనగల్లు: రాష్ట్రంలో వడ్డెరుల ఆర్థికాభివృద్ధి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని జిల్లా వడ్డెరసంఘం అధ్యక్షుడు వెంకటరమణ, మండల అధ్యక్షుడు గండికోట మల్లేశ్‌లు కోరారు. వివిధ కులాలకు సంబంధించి 16 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం వడ్డెరులను విస్మరించడం సరైంది కాదన్నారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని వడ్డెరసంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ వారు ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం వెంకటరమణ, గండికోట మల్లేశ్‌లు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్‌పార్టీ వడ్డెర కార్పోరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని వారు గుర్తుచేశారు. రాష్ట్రంలో పాలకులు మారుతున్నప్పటికీ వడ్డెరల జీవితాలు మాత్రం మారడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ వడ్డెరుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్, శంకర్, శ్రీనివాస్, గణేశ్, మురళి, ఆంజనేయులు, గోవింద్, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

కడ్తాల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన శ్రీరామ, శివపార్వతులు, సరస్వతీ దేవి, హనుమాన్ ఆలయాలను స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని, ఆలయాల నిర్మాణాలతో గ్రామాల్లో భక్తిభావం పెంపొందించొచ్చన్నారు. ఈ కార్యక్రమలో డీసీసీ ఉపాధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్, సుధీర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ అనిల్‌కుమార్, పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటా..

ఆపదలో ఉన్న ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటానని సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలోని ఆమనగల్లు, వెల్దండ, కల్వకుర్తి మండలాల్లో మంగళవారం సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఆయన పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఆమనగల్లు పట్టణంలో మండల యువజన అధ్యక్షుడు రాజశేఖర్ కుమారుడు అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండటంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి, కల్వకుర్తి నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌గౌడ్, మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు, బాలరాజు, దళపతిగౌడ్, రచ్చశ్రీరాములు, నరేందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, యూసుఫ్‌బాబా, కొండల్‌యాదవ్, రమేశ్‌నాయక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



రాజశేఖర్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

పరామర్శ

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి తండ్రి గూడూరు నారాయణరెడ్డి ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట నాగర్‌కర్నూల్ జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, రాంచందర్‌నాయక్, బుచ్చయ్య తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కరువు

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ

కడ్తాల్: పది సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కరువుకు కారణమని, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ వైఫల్యాలను కాంగ్రెస్ ప్రభుత్వంపై నెట్టేందుకు, మాజీ ముఖ్యమంత్రి బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ కుట్రలు పన్నుతున్నారని ప్రజలు ఏ మాత్రం విశ్వసించరని పేర్కొన్నారు. అధికారం కోల్పోయాక కేసీఆర్‌కు రైతుల బాధలు గుర్తొస్తున్నాయని ఎద్దేవా చేశారు. ప్రజా విశ్వాసం కోల్పోయిన బీఆర్‌ఎస్ త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు సాగిస్తున్న ఎత్తుగడలను, డ్రామాలను ప్రజలు విశ్వసించరని మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలు ఎన్ని కుట్రలు పన్నిన కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 6న జాతీయ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గ్యారంటీలను ప్రకటించనున్న నేపథ్యంలో నిర్వహించనున్న తుక్కుగూడ జనజాతర శంఖారావ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు వేల సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బాలరాజ్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, కృష్ణనాయక్ పాల్గొన్నారు.



కడ్తాల్: మాట్లాడుతున్న నర్సింహ

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోండి

సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహరెడ్డి

కడ్తాల్: రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రత నేపథ్యంలో గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు, సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహరెడ్డి 'ఎక్స్' సామాజిక వేదికగా మంగళవారం విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో, తండాల్లో భూగర్భజలాలు అడుగంటి పోయాయి. చెరువులు, కుంటలు, బోరు బావులు నీటి మట్టాలు తగ్గిపోవడంతో నీటి సమస్య ఎదురవుతోందని, మూగజీవాలు పశువులకు నీరు దొరకక అలమటిస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలలో గతంలో నిర్మించిన నీటి తొట్లలో నీటి ట్యాంకర్ల ద్వారా నీటితో నింపించి, మూగ జీవాల దాహార్తిని తీర్చే విధంగా అధికారులకు ఆదేశాలివ్వాలని ఆయన కోరారు.

బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జిగా లష్కర్‌నాయక్

షాద్‌నగర్: లోక్‌సభ ఎ న్నికల సందర్భంగా బీజేపీ షాద్‌నగర్ ఎన్నికల ఇన్‌చార్జిగా పాత్లావత్ లష్కర్‌నాయక్‌ను మంగళవారం నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన సేవలకు గుర్తింపుగా పార్టీ అధిష్టానం ఇన్‌చార్జిగా నియమించడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి డీకే అరుణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

తలకొండపల్లి: దైవ బలం మహా గొప్పదని, దైవ బలం ముంటే లక్ష్మీదేవి ఆవహించి సకల ఐశ్వర్యాలతో పాటు, మంచి ఆరోగ్యాన్ని కలుగజేస్తుందని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. చీపునుంతల సీతారామ లక్ష్మణ, శివ, నంది, ఆంజనేయస్వామి ఆలయాన్ని మంగళవారం జైపాల్‌యాదవ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్ ఆలయ అభివృద్ధి కోసం రూ.10వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు బాల కుమార్ గౌడ్ నరోత్తంరెడ్డి, జనార్దన్‌రెడ్డి, నగేశ్, యాదయ్య, వెంకటయ్య, లింగం, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: దైవ కార్యక్రమాల్లో ప్రజలంతా పాలు పంచుకోవాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కోరారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించి శ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయాన్ని ఆయన సందర్శించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్‌ను ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోలెపల్లి ఎంపీటీసీ సభ్యులు దోనాదుల కుమార్, బీఆర్‌ఎస్‌నాయకులు లాలయ్యగౌడ్, ఆలయ నిర్వాహకులు వీరేశ్‌గౌడ్, రాముగౌడ్, శేఖర్‌గౌడ్, తిరుపతిగౌడ్, బాలరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

మాడ్గుల: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మాడ్గుల సీఐ విష్ణువర్ధన్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా గిరికొత్త పల్లి గ్రామ శివారు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఇర్విన గ్రామనికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ దామర్ల శ్రీకాంత్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

కానిస్టేబుల్‌గా ఎంపికైన హోంగార్డుకు సత్కారం

ఆమనగల్లు: ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న సుధాకర్ పీటీఓ ఫైర్ సర్వీసెస్ విభాగంలో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సుధాకర్‌ను సీఐ ప్రమోద్‌కుమార్ ఘనంగా సత్కరించారు. అనంతరం సీఐ మాట్లాడారు. పట్టుదలతో చదివి కానిస్టేబుల్‌గా ఎంపిక కావడం హర్షదాయకమని సీఐ ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు ఎస్ఐ బాల్‌రాం, సిబ్బంది పాల్గొన్నారు.



సుధాకర్‌ను సత్కరిస్తున్న సీఐ ప్రమోద్‌కుమార్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386